# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

2. **అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ పథకం రెండో విడత నిధులను ఈనెల 19వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు.**

3. **గ్రామీణ ప్రాంతాల్లోనూ రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.**

4. **విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు ద్వారా 13 లక్షల 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు.**

============================

ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరులోని మూలాపేట బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఇప్పటికే నెల్లూరు నగరంలోని వి ఆర్ మున్సిపల్ పాఠశాలను అభివృద్ధి చేశామని ఇదే తరహాలో.. అన్ని పాఠశాలలను తీర్చి దిద్దుతామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

-------------------------

అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ పథకం రెండో విడత నిధులను ఈనెల 19వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులతో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధుల అమలుపై ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ జిల్లా కమలాపురంలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారని తెలిపారు.

-------------------------

గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి జనార్దన్ రెడ్డి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని నిన్న ఆయన ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. ఆచంట మండల కేంద్రంలో సుమారు 2 కోట్ల పది లక్షల రూపాయల నిధులతోకచ్చా రహదారులు, మురుగునీటి వ్యవస్థను పూర్తి చేశామని మంత్రి వివరించారు.

-----------------------------

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంత్యోత్సవాల్లో భాగంగా కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వశాఖ, మై భారత్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా గాజువాకలో ఐక్యతా మార్చ్‌ను ఈరోజు నిర్వహించారు. పాత గాజువాక జంక్షన్ నుంచి కొత్త గాజువాక జంక్షన్ వరకు జరిగిన ఈ ర్యాలీ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ఉక్కు మనిషి, భారత రత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.

-----------------------------

పత్తి రైతులు దళారులను ఆశ్రయించకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా –సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడి విక్రయ కేంద్రానికి తీసుకువచ్చిన పత్తిని, అందులోని తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం కృష్ణప్రసాద్ పాత్రికేయులతో మాట్లాడుతూ సీసీఐ నిబంధనల ప్రకారం పత్తిలో తేమ 12 శాతంలోపు ఉండాలన్నారు. వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాల వల్ల పత్తిలో నాణ్యత తగ్గిందని రైతులు పత్తిని ఆరబెట్టి కొనుగోలుకు తీసుకుని రావాలని కోరారు.

-----------------------------

విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు ద్వారా 13 లక్షల 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ , రాష్ట్రానికి పెట్టుబడుల ద్వారా పరిశ్రమలు వస్తాయని తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగాలు రానున్నాయని కేశినేని శివనాథ్ తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------------

ప్రజల నిత్య జీవితంలో రేడియో ఒక భాగమైందని విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.జి.వి. సరిత పేర్కొన్నారు., ప్రసార భారతి, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వేదికగా జాతీయ 67వ సంగీత సమ్మేళనాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా

ప్రముఖ సంగీత విద్వాంసురాలు కొల్లూరు వందన శాస్త్రీయ సంగీత కచేరి చేయగా, సుబ్బరాయ శాస్త్రి, త్యాగరాజ స్వామి, అన్నమయ్య తదితర వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీపీ సరిత మాట్లాడుతూ, జాతీయ సమైక్యతను చాటేది సంగీతమేనని, రేడియో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా అనేక ప్రజాహిత కార్యక్రమాలను ప్రసారంచేస్తోందని తెలిపారు.

---------------------------

తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియంలో విద్య, పరిశోధన సంస్థలలో గ్రంథాలయాల యాంత్రీకరణపై 14 వ అంతర్జాతీయ కాలిబర్-2025 సమావేశం ఈరోజు ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఉమ కంజిలాల్ ప్రారంభించగా, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ఉపకులపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే దేశ, విదేశాలకు చెందిన 500మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా 14వ అంతర్జాతీయ కాలిబర్-2025 కార్యనిర్వాహక కార్యదర్శి కె.సురేంద్రబాబు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 33 సెకన్లు

---------------------------

జాతీయ మూర్ఛవ్యాధి నివారణా అవగాహనా దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. మెదడులోని నరాలలో వచ్చే మార్పులు ...., తలకు తగిలే గాయాలు ...., పక్షవాతం ..., మెదడులో ఏర్పడే ట్యూమర్లు ...., చిన్నతనంలో ఎక్కువ కాలం పాటు జ్వరం కొనసాగడం తదితర కారణాల వల్ల మూర్ఛ వ్యాధి సంభవించే అవకాశం ఉంది జన్యుపరమైన కారణాల వల్ల కూడా మూర్ఛ వ్యాధి రావచ్చు. ఈ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించడం కోసమే ఈరోజు మూర్ఛ వ్యాధి నివారణా అవగాహనా దినాన్ని పాటిస్తున్నారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో స్థిరంగా కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈరోజు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================